# బేబీ సిట్టింగ్

సుగుణని గమనిస్తూనే వున్నాడు రెండు మూడు రోజులుగా మామగారు రాజారావు. ఏదో దిగులుగా కనిపిస్తుంది కోడలు. అబ్బాయి టూరు ఉద్యోగం ఎప్పటినుంచో వున్నదే. ఇవాళ కొత్తగా చేయటం కాదు అది. అత్తగారు కూతురి పురిటికి అమెరికా వెళ్ళి నెల దాటింది. అదీ తెలిసిన విషయమే. మరి ఏమిటీ, పసిపిల్లని ఒళ్ళో పెట్టుకుని ఏదో ఆలోచనలో మునిగిపోయిన సుగుణ వంక పరిశీలనగా చూసాడు రాజారావు.

"అమ్మాయ్." ఉలిక్కిపడింది సుగుణ మామగారి గొంతు విని.

గబగబా లేచి కుర్చీ చూపించింది.

"ఒంట్లో బాగాలేదా అమ్మా." నెమ్మదిగా అన్నాడు పిల్లని ఎత్తుకుంటూ.

"ఇప్పుడు ఇదో పెద్ద సమస్య..."

"ఏదీ."

"ఇదే—" పిల్ల వంక చూస్తూ అంది సుగుణ.

సెలవు ఇక నాలుగురోజుల్లో అయిపోతుంది. తను ఉద్యోగంలో

చేరాలి.... పిల్ల సంగతి ఏమిటీ - ఎవరు చూస్తారూ - క్రెచ్‌లో వెయ్యాలి.... ఇంత పసిపిల్లని ఇంట్లోంచి బయటకి తీసికెళ్ళటం— సుగుణ మనసులో బాధంతా అదే -

"క్రెచ్ కూడా దగ్గర్లో లేదు" అంది నెమ్మదిగా సుగుణ. విషయం అర్థమయిపోయింది మామగారికి.

"నో. ఈ పసిదాన్ని క్రెచ్‌లో వేయడానికి వీల్లేదు" గట్టిగా అన్నాడు.

"మరి." మరీ నెమ్మదిగా అంది మామగారి వంక చూస్తూ.

"నా చిట్టితల్లిని క్రెచ్‌లో పెడతావా" పిల్లని గుండెలకి హత్తుకున్నాడు. పకపకా నవ్వాడు.

సుగుణకి ఆ నవ్వు చూస్తే భయమేసింది.

పెంచటం కుదరకపోతే పిల్లల్ని కనకూడదు. అంటాడేమో.

ఉద్యోగం మానేయ్. ఇంట్లో వుండి పిల్లని చూసుకో అంటాడేమో. మీ అమ్మని ఇక్కడకొచ్చి పిల్లని చూసుకోమను అంటాడేమో. ఏమో!! ఏదన్నా అనచ్చు!!

"అమ్మాయ్! ఇటు విను" గంభీరంగా వున్న మామగారి గొంతు సుగుణకి కొత్తగా వినిపించింది.

"మీ అత్తగారు అమెరికాలో వున్నా, మీ అమ్మగారు ఇంగ్లండులో వున్నా, మీ భర్తగారు ఇరాన్‌లో వున్నా, నీ సెలవ అయిపోయినా వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. ఈ పసిగుడ్డు...."

రాజారావు అంటుండగానే "అదే మా బెంగ" అంది సుగుణ.

"నేను లేనా? రిటైరయి నేను లేనా?"

"మీరా!" వెంటనే ఆశ్చర్యంగా అనేసింది సుగుణ.

"ఆ! నేనే! ఏం? ఈ పసిదాన్ని చూసుకోలేననా! టైముకి పాలు పొయ్యటం, ఏడిస్తే ఎత్తుకోటం, ఆడించటం - అంతేగా! ఎందుకు నీకు భయం?"

సుగుణకి చాలా నవ్వొచ్చింది. ఏడాదయింది మామగారు ఉద్యోగం నుంచి రిటైరయి. పొద్దున్నే అత్తగారు, మామగారు వాకింగ్ కి వెళ్ళటం, సాయంత్రం ఇద్దరూ క్లబ్బు కెళ్ళటం, తనకి తెలుసు. మధ్యాహ్నం నిద్రపోవటం, టీవీ చూట్టం, పుస్తకాలు చదువుకోటం – మామగారు పసి పిల్లను చూస్తాననటే తను ఎలా ధైర్యంగా సరే అంటుంది!!

సుగుణకి ఏమీ అర్థం కావటంలేదు. క్రెచ్ లో వేస్తేనే బాగుంటుంది. వాళ్ళు బాధ్యతగా చూస్తారు పిల్లని.

ఎవరికైనా పసి పిల్లని పెంచటం చాలా కష్టం. మగాళ్ళు పసి పిల్లల్ని జాగ్రత్తగా పెంచటం మరీ కష్టం కదా!

"ఏమిటి! మగాళ్ళు పిల్లల్ని పెంచలేరా? చూడమ్మాయి, ఎవరి సంగతో నాకు తెలియదు. మీ నాన్న పెంచలేడేమో! నేను హాయిగా పెంచగలను. నువ్వు సెలవు అయిపోయిందని బెంగ పడకు. నీ వుద్యోగంలో మళ్ళీ చేరిపో" రాజారావు పిల్ల నెత్తుకుని తన గదిలోకి వెళ్ళి పోయాడు.

సుగుణకి ఏం చెప్పాలో తోచలేదు. క్రెచ్ లో వేయటానికి ఒప్పుకోలేదు. ఆయనేం చూస్తారూ పసిదాన్ని? ఆ సమస్య దానంతట అదే తీరాలి. తనేం చేయగలదు? సుగుణ చిరాగ్గా ఇంట్లో ఆ పని ఈపని చేసుకోటంలో మునిగిపోయింది.

ఆఫీసులో కూచున్న సుగుణ మనసంతా పిల్లమీదే వుంది. మామగారు రోజూ మధ్యాహ్నం నిద్రపోతే పిల్లకి పాలు ఎలా? అయినా ఈ ఉద్యోగం వదిలేస్తే! హమ్మో! పిల్ల నాలుగేళ్ళయేసరికి బడికెళ్ళిపోతుంది. తనకి ఉద్యోగం మళ్ళా ఎలా వస్తుంది!? అయినా మామగారికి మరీ మొండి తనంకాసీ, క్రెచ్ లో వేస్తే ఏమవుతుందో!?

రాజారావు పిల్లని ఒళ్లో పెట్టుకున్నాడు. కక్కటిల్లి ఏడుస్తోంది. పాలు ఇప్పుడేగా సీసాడూ తాగేసింది. మరి ఎందుకేడుస్తోందో? భుజాన

వేసుకొని జోకొడుతూ అటూ ఇటూ తిరిగాడు. కొద్ది నిముషాలలో నిద్ర పోయింది. రాజారావుకి గొప్ప ఆనందం కలిగింది.

ఈ ఆడవాళ్ళకి మహా గర్వం! తాము తప్ప పిల్లల్ని ఎవరూ పెంచలేరనీ, నేను పెంచలేనట! ఎందుకు పెంచలేనూ? నెమ్మదిగా ఉయ్యాల్లో పడుకోబెట్టాడు పిల్లని రాజారావు.

రోజు పదిన్నరకి అన్నం తినే రాజారావు ఆ రోజు డైనింగ్ టేబుల్ దగ్గర కూచునేసరికి ఒంటి గంట దాటింది. భోజనం పూర్తిచేసి మంచంమీద వాలిపోయాడు. ఇలా పడుకున్నాడో లేదో కరెంటుపోయింది. ఉయ్యాల్లో పిల్ల కేరుమంది. పక్కనున్న పేపరు తీసి పిల్లకి విసరటం మొదలు పెట్టాడు. గాలి తగులుతూంటే హాయిగా పడుకుంది. రాజారావు మళ్ళీ విసిరాడు. ఒక్కసారి గుక్కపెట్టి ఏడుప్పు మొదలెట్టింది. ఏమైందీ? పేపరు కంటికి తగిలిందా? రాజారావు పిల్లని ఉయ్యాల్లోంచి తీసాడు.

ఇంకో గంటలో తల్లి వచ్చేస్తుందనే ధైర్యం కాగానే, రాజారావు పిల్లకి పాలు కలిపిపట్టాడు. గౌను మార్చాడు. పౌడరు రాసాడు. ఉయ్యాల గదిలో ఫాను తిరుగుతోంది. చిట్టితల్లి హాయిగా నిద్రబోయింది.

ఇంట్లో అడుగుపెట్టిన సుగుణ తిన్నగా ఉయ్యాల తొట్టి దగ్గర కొచ్చింది. పువ్వులా వున్న పిల్లని చూడగానే మనసు హాయిగా అనిపించింది.

"ఏడ్చిందా మామయ్యగారూ! మీరు టైముకి భోజనం చేశారా?" అంది టీ తాగుతూ.

"నా చిట్టి తల్లి, బంగారు తల్లి అది ఒక్కసారి కూడా ఏడవలేదు, రెండుసార్లు పాలు కలిపి పట్టాను. పాలు తాగింది నిద్రపోయింది. నేను అది హాయిగా నిద్రపోయాం" రాజారావు ఆవులిస్తూనే అన్నాడు.

వారం రోజులు గడిచాయి. రాజారావుకి చాలా బడలికగా ఉంది. టైముకి భోజనం, నిద్ర అలవాటయిన రాజారావుకి ఆ రెండూ టైముకి

కథా నిలయం
658

జరగటం లేదు. పసి పిల్లల్ని పెంచటం చాలా కష్టమే అనుకున్నాడు. పాలన్నీ కక్కేసుకున్న పిల్లకి గౌను విప్పి మరో గౌను తొడుగుతూ రాజారావుకి ఒక్క నిముషం తీరిక ఉండటంలేదు. ఏదైనా ఉపాయం ఆలోచించాలి. కానీ, క్రెష్‌లో వేసేద్దాం, అంటే తను ఓడిపోయినట్టే కోడలు నవ్వుతుంది కూడా!

రాజారావు పక్క వాటాలోకి వెళ్ళాడు, పిల్ల నెత్తుకుని "రండి బాబాయిగారూ! కోడలు లేదా ఇంట్లో?" అంది రమణమ్మ, పక్కవాటాలో వుండే సుబ్బారావు తల్లి.

ఆ మాట ఈ మాట మాట్లాడటం అయ్యాక రాజారావు మెల్లగా అన్నాడు రమణమ్మతో.

"పిల్లని చూసుకుందుకు ఎవరైనా ఉంటే బాగుండును. రెండు నెలలలో నా భార్య అమెరికా నుంచి వచ్చేస్తుంది. అంతవరకయినా...."

"ఆ....పిల్లని చూసుకోటం ఏమంత కష్టం బాబాయిగారూ! మా యింట్లో దింపండి. ఏమైనా మగాళ్ళు పిల్లల్ని చూసుకోటం కష్టమే మరి." రమణమ్మగారూ మగాళ్ళు పిల్లల్ని చూసుకోటం కష్టం అనే అంటుం దేమిటి? రాజారావుకి నవ్వొచ్చింది. అవునమ్మా! అందుకే ఆడవాళ్ళకున్న ఓర్పు, నేర్పు, ముఖ్యంగా పిల్లల్ని పెంచటంలో చాలా గొప్పవి, ఎక్కువైనవే. నేను హాయిగా పెంచగలను కాకపోతే, మా కోడలికే నమ్మకంలేదు. అందుకని పిల్లని చూసుకుందుకు! నసిగాడు రాజారావు.

"మా చెల్లెలి కూతురు నిన్ననే వచ్చింది. ఏదో ఉద్యోగంలో పెడతానని మావాడు రాస్తే వచ్చింది. ఆ ఉద్యోగం వచ్చేవరకూ పిల్లని చూసుకోమని చెప్తా. మీరు బెంగపడకండి, అది చూసుకుంటుందిలెండి."

రమణమ్మ మాటలు రాజారావుకి ఎంతో సంతోషం కలిగించాయి.

"ఇంతకన్నా గొప్ప అదృష్టం ఇంకేముంది?"

-

"అమ్మా రమణమ్మగారూ! పిల్లని ఊరికే చూసుకోవద్దు. ఎంత తీసుకుంటుందో చెప్తే అంతా ఇస్తాను."

రాజారావు ఆనందం పట్టలేకుండా వున్నాడు. ఆ అమ్మాయి పసిదాన్ని చూస్తుంది. పాలు కలపటం, పట్టడం, నిద్ర పుచ్చటం అన్నీ ఆ అమ్మాయే చూస్తుంది. తను హాయిగా పదిన్నరకి భోజనం చేయచ్చు, నిద్రపోవచ్చు, టి.వి. చూడచ్చు. హమ్మయ్య, అంతలోనే రాజారావుకి కోడలు మాటలు గుర్తొచ్చాయి.

పిల్లని తనే చూస్తానన్నాడుగా మరి!!

రాజారావు హడావిడిగా రమణమ్మగారి దగ్గరకొచ్చాడు.

"అమ్మా ఒక్కమాట. ఇందాక ఎప్పుడొచ్చి ఎప్పుడెళ్ళాలో చెప్పలేదు మీకు. "పది దాటాక మా యింట్లోకి రావాలి, నాలుగు దాటాక వెళ్ళిపోవాలి."

"అదేమిటండీ బాబాయిగారు! నాలుగు దాటాక అని టైము చెప్తున్నారేమిటి? హాయిగా ఐదింటివరకు వుండి, మీ కోడలు వచ్చాక పిల్లని అప్పగించి వస్తుంది"

రాజారావు ఖంగారు పడిపోయాడు.

"అబ్బె అలావద్దు. ఏరోజూ పది దాటాకే రావాలి, నాలుగు అవగానే వెళ్ళిపోవాలి. దానికిష్టమయితేనే మరి."

"సరే" అంది రమణమ్మగారు గుమ్మంలో నుంచున్న రాధవంక చూస్తూ.

రాజారావుకి చాలా హాయిగావుంది. సుగుణ ఆఫీసునించి వచ్చేవేళకి పిల్ల మంచి గౌను వేసుకుని ఒళ్ళంతా పౌడరు ఘుమఘుమలలో ముద్దుగా కనిపిస్తోంది.

తను పొరబాటు పడింది. మామగారు పిల్లని బాగా చూడలేరనుకుంది. ఎంత బాధ్యతగా, బాగా చూసుకుంటున్నారో. మగాళ్ళు పసి

పిల్లని చూడలేరని తను తొందరపడి అంది అరోజు. సుగుణ పిల్లని చూస్తూ అబ్బో! కాటుక పెడుతున్నారు. నీకు దిష్టి చుక్క కూడా పెడుతున్నారా మీ తాతగారు! బుగ్గపక్కనున్న నల్లనిచుక్కని చూస్తూ అంది.

"చూసుకో! పాల సీసాలు ఎప్పటికప్పుడు వేడినీళ్ళలో ఉడక పెడుతున్నా. పక్కబట్టలు ఎప్పటికప్పుడు మార్చి ఉతికినవి వేస్తున్నా. చూసావా, కాటుక పెట్టడం కూడా నేర్చుకున్నా. నువ్వు ఆఫీసునించి వచ్చేసరికి పిల్ల లక్షణంగా వుండాలని ఇవన్నీ చేస్తున్నా. అయినా నా చిట్టితల్లి నన్ను విసిగించదుగా. రాజారావు చాలా గొప్పగా చెప్తుంటే ఆశ్చర్యంగా వింది సుగుణ.

"పాపం, మామగారు మధ్యాహ్న నిద్ర, టి.వి. అన్నీ ఈ పసిదాని కోసం మానేసారన్న మాట" అనుకుంది మనసులో.

"అయినా అత్తగారు పై నెలలో వచ్చేస్తారుగా" అంది సుగుణ పిల్లనోట్లో పాలసీసా పెడుతూ.

"ఆ. మీ అత్తగారు ఇంకో ఆరునెలలు రాకపోయినా ఫరవాలేదు. నాకు తెలిసిపోయిందిగా పసిపిల్లల్ని ఎలా చూసుకోవాలో" అన్నాడు రాజారావు పేపరు తిరగేస్తూ.

నెలరోజులు గడిచాయి. సుగుణ పిల్లగురించి బెంగపడటం మానేసింది. ఆఫీసులో పని శ్రద్ధగా చేస్తోంది.

ఆ రోజు ఎందుకో తలనొప్పిగా వుంది సుగుణకి. జ్వరం తగిలిం దనిపించింది. పర్మిషన్ తీసుకుని ఇంటికి బయలుదేరింది.

గుమ్మంలో అడుగుపెట్టగానే తలుపు దగ్గరగా వేసుంది. ఉయ్యాల తొట్టి ఖాళీగా వుంది. సుగుణ గుండె ఆగినంత పనైంది. గబగబా ముందు గదిలో కెళ్ళింది. మామగారు గాఢనిద్రలో ఉన్నారు. సుగుణకి కాళ్ళాడటం లేదు. పిల్ల ఏమైందీ — ఖంగారుగా పక్క గదిలో కెళ్ళింది.

పిల్ల చాపమీద పడుకుని నిద్రపోతోంది.

"చిట్టితల్లి ఈ చాపమీద పడుకోపెట్టి –" గబుక్కున పిల్లనెత్తుకుని గుండెలకి హత్తుకుంది.

"పిల్లల్ని ఎత్తుకుపోతున్నారట ఈ మధ్య –" సుగుణ భయం భయంగా చూస్తూ.

"ఎవరు నువ్వు" అరిచింది.

ఒళ్ళు విరుచుకుంటూ లేచింది రాధ.

"ఎవరు నువ్వు –" సుగుణ పిల్లని గట్టిగా హత్తుకుంటూ అంది మళ్ళా.

"ఉష్. అరవకు. బాబుగారు నిద్రపోతున్నారు" రాధ చాపచుట్టింది.

"ఏమిటీ?" ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసింది సుగుణ.

రాధ నవ్వుతోంది.

"ఏమిటమ్మా ఆ ఖంగారు. ఈ పిల్లనెత్తుకుపోతాననుకుంటున్నావా. నా కెందుకూ. బాబుగారు ఏదో బతిమలాడితే. పోనీలే అని ఒప్పుకున్నా – అంతే–" రాధ ఆ మాట అంటూనే ఫ్లాస్క్‌లో కాఫీ సుగుణకి ఓ కప్పులో పోసిచ్చి తనూ కప్పులో పోసుకు తాగింది.

"రోజూ నాలుగు గంటలయి అలారం మోగటం, బాబుగారు నిద్ర లేవటం జరుగుతుంది. ఇవాళ నువ్వు ముందొచ్చావు. ఇదీ మంచిదే. నేను సినిమా కెళ్ళాలనుకుంటున్నా" అంటూ పిల్లని సుగుణ చేతిలోంచి లాక్కుని, గబగబా ముఖం, కాళ్ళు, చేతులు తుడిచి పౌడరు అద్దింది. గౌను మార్చింది ఉయ్యాల తొట్టిలో వేసింది.

"ఇక చూసుకో. నే వస్తా" అంటూ తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయింది.

ఆ మాట ఈ మాట మాట్లాడుతూ అన్ని వివరాలు చెప్పేసింది రాధ.

సుగుణ రాధ వెళ్ళిన వైపే చూస్తోంది. అలారం గడియారం నాలుగు గంటలు కొట్టింది. రాజారావు గబుక్కున లేచాడు. ఉయ్యాల దగ్గరకొచ్చి విస్తుపోయాడు ఖాళీగా వుంది ఉయ్యాల!!

పిల్ల!!!

ఎత్తుకుపోయిందా అది!! రాధా! రాధా! గబగబా ముందుగదిలో కొచ్చాడు అరుస్తూ.

పిల్లని ఒళ్ళో పెట్టుకు సోఫాలో కూచున్న కోడల్ని చూడగానే రాజారావు ముఖం ఓ క్షణం వెలవెలపోయింది.

"నువ్వెప్పుడొచ్చావూ?" అన్నాడు అటుఇటు చూస్తూ. "మూడింటికే" సుగుణ నవ్వుతోంది.

టీకప్పు చేతికందిస్తూ, "అయినా ఐదువందల రూపాయలా?" అంది.

"ఐదు వందలేమిటీ?" సుగుణ ముఖంలోకి చూస్తూ అన్నాడు రాజారావు.

"అదే!" అంది విషయం అంతా తనకి తెలిసిపోయినట్టుగా సుగుణ.

రాజారావు మనసు తేలికైపోయింది.

"అవును! నా యిష్టం. నా మనుమరాలికోసం, అయినా నా పెన్షన్ డబ్బులు నా యిష్టం. నీ డబ్బులో, నీ మొగుడి డబ్బులో అయితే అయిదొందలెందుకని రెండొందలకి క్రచ్‌లో వేసుకుంటారు. మాకేం ఖర్మ. కదురా తల్లీ! నువ్వు ఇంట్లోనే తాత దగ్గరే వుండాలి. కదురా చిట్టీ" అంటుండేనే తల్లి దగ్గరనుంచి తాత ఒళ్ళోకొచ్చేసింది చిట్టితల్లి.

## డా॥ ముక్తేవి భారతి

రాజాబహదూర్ వెంకట రామారెడ్డి మహిళా కళాశాల తెలుగు శాఖలో రీడర్‌గా పనిచేస్తున్నారు. విశ్వ విద్యాలయ మరియు కళాశాల అధ్యాపకుల రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారము 1990-91 లో అందుకున్నారు. ఫిలిమ్ సెన్సార్‌బోర్డ్ సలహా సంఘ సభ్యురాలిగా (1986-89) వున్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి యం.లిట్., పి హెచ్‌డి. పట్టాలు పొందారు. వివిధ సాంస్కృతిక సంస్థలతో సన్నిహిత సంబంధం, జీవిత సభ్యత్వం వున్నాయి. 1995 లో కేసరి కుటీరం నుంచి "గృహలక్ష్మి" అవార్డు అందుకున్నారు.

**రచనలు :**

1. చిలకమర్తి సాహిత్య సేవ
2. చిలకమర్తి కవితా వైభవము
3. భారతంలో ప్రేమకథలు
4. కంచె చేను మేస్తే
5. ముక్తేవి భారతి కథలు
6. కావ్యతారలు - 'వనిత' మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడిన కథలు.
7. భారతీయం - 'ఉదయం' వార పత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడిన గేయాలు.
8. తంజావూరు నాయకరాజుల కాలంలో రచయిత్రులు (యం.లిట్ సిద్ధాంత వ్యాసం - అముద్రితము).

Printed at Lakshmi Ganapathi Printing Press,
SRT 199, 1-1-379-50/1, Jawahar Nagar, Hyderabad - 500 020.